క్లుప్తంగా

అభివృద్ధి పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 8వ వార్డు పాతమంచిర్యాలలో శ్రీరామాలయం శివాలయం భక్తాంజనేయ స్వామి కమాన్ నుంచి హనుమాన్‌నగర్ వరకు టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.70లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను సోమవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. అనంతరం రజకకాలనీ అండర్ డ్రెయినేజీ, సీసీ రోడ్డును ప్రారంభించారు. మున్సిపల్, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.40లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, 9వ వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీత, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, కౌన్సిలర్లు గాదె సత్యం, పోరెడ్డి రాజు, సుదమల్ల హరికృష్ణ, మాదంశెట్టి సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, మాజీ కౌన్సిలర్లు బొలిశెట్టి కిషన్, పల్ల రాజన్న, కోదాది కమల, నాయకులు దుర్గం రాజేశ్, రవీందర్‌రావు, కోదాది రమేశ్, నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు, తూముల వెంకటరామయ్య, వేముల గురువయ్య, కార్ల పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యురాలు

మందమర్రిరూరల్: మందమర్రి పరిధిలోని జాతీయ రహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష వైద్యశిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ హర్షితారెడ్డి సుమారు రెండు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 125మందికి కళ్లజోళ్లు, కావాల్సిన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ అజయ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి, వినయ్‌కుమార్, తేజప్రసాద్, ఆనంద్, రామాంజనేయులు తదితరులున్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం



లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్లో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. గోపూజ, అన్న ప్రసాదీకరణ నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్, హిందూ ధర్మ ప్రచార కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.80
పచ్చిమిర్చి	100
చిక్కుడు కాయ	80
బీరకాయ	60
వంకాయ	50
కాకరకాయ	60
బెండకాయ	50
అలసంద	60
దొండకాయ	70
సోరకాయ	40
ఆకుగోబి	60
పూగోబి	80
క్యారెట్	80
క్యాప్సికం	80
పాలకూర	40
తోటకూర	40
ములక్కాయ	100

- మంచిర్యాలఅగ్రికల్చర్



నంబర్ వార్!

- వివాదాస్పదంగా ఇంటి నంబర్ల కేటాయింపు
- అధికారులు, కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం
- అక్రమాలకు తెరలేపారని విమర్శలు



బెల్లంపల్లి: బల్దియాలో ఇంటి నంబర్ల కేటాయింపులు మళ్లీ రచ్చవుతున్నాయి. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్ల మధ్య వివాదానికి కారణమవుతున్నాయి. ఇంటి నంబర్ కేటాయింపు అంశంలో ఇటీవల కమిషనర్, ఓ కౌన్సిలర్ మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఆ మధ్య తప్పుడు పద్ధతిలో ఇంటి నంబర్లు మంజూరు చేస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో కొన్ని నెలల పాటు కేటాయింపులు ఆపేశారు. ఇటీవల మున్సిపాలిటీలో ఇళ్ల పట్టాలను తాజాగా జారీ చేస్తుండటంతో, మళ్లీ కేటాయింపుల పర్వం మొదలైంది. ఇదే అదునుగా ఇంటి నంబర్ల దందాకు తెర తీశారనే విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో అటు మున్సిపల్ అధికారులు, ఇటు కౌన్సిలర్ల మధ్య వివాదాలు తలెత్తున్నాయి. ముడుపులు తీసుకుని, లేని ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అధికార బలంతో ఓ ప్రజాప్రతినిధి అధికారులపై ఒత్తిడి తెచ్చి, ఇంటి నంబర్ల వ్యవహారాన్ని చక్కబెట్టుకుంటున్నట్లు సొంత పార్టీ కౌన్సిలర్లే ప్రచారం చేస్తుండటం గమనార్హం. అదే తీరుగా కొందరు కౌన్సిలర్లు కూడా అదే బాటను అనుసరిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ దందా లాభసాటిగా మారడంతో గుట్టుచప్పుడు కాకుండా ఒక్కో ఇంటి నంబర్‌కు వేలాది రూపాయలు చేతులు మారుతున్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. విద్యుత్, నల్లా కనెక్షన్ కోసం ఇంటి నంబర్ అనివార్యం కావడంతో, అడిగినంత ముట్టజెప్పి పురప్రజలు పని చక్క బెట్టుకుని మిన్నకుండిపోతున్నారు.

నిర్మాణాలు చేపడితే సరి...

మున్సిపాలిటీలో 34వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో ఏ వార్డులో శాశ్వత కట్టడం కడుతున్నా, మున్సిపల్ సిబ్బంది వచ్చి అడ్డుకోవడం సర్వసాధారణంగా మారింది. మున్సిపల్ అనుమతి లేదని గృహనిర్మాణ సామగ్రిని తీసుకెళ్లడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వ్యవహారంలో కొందరు ప్రజాప్రతినిధులు మధ్యవర్తిత్వం వహించి, డీల్ కుదిరించి యధాతథంగా ఇళ్ల నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవడం సాధారణ తంతుగా మారింది. ఇళ్ల నిర్మాణాల విషయంలో అధికారులకు సదరు వార్డు ప్రజాప్రతినిధులే ఉప్పందిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇళ్ల నంబర్ల కేటాయింపులతో పాటు ఇళ్ల నిర్మాణాల విషయంలోనూ కొందరు అందిన కాడికి దండుకోవడం చేస్తున్నారనేది నగ్నసత్యం.

నిబంధనల ప్రకారంగానే...



ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఇంటి నంబర్లను కేటాయిస్తున్నాం. సరైన పత్రాలు లేని ఇళ్లకు నంబర్లను కేటాయించడం లేదు. కొందరు వచ్చి ఒత్తిళ్లు తెస్తున్నారు. ఎంత చెప్పినా వినకుండా వాగ్వాదం చేస్తున్నారు. అన్ని సవ్యంగా ఉన్నవాటికి నంబర్ల కేటాయింపులో ఎలాంటి జాప్యం చేయడం లేదు. ఎవరెంత ఒత్తిడి తెచ్చి నా, ప్రభుత్వ నిబంధనల ప్రకారంగానే వ్యవహరిస్తాం.

- కె.సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

భర్తల పెత్తనం..

మున్సిపాలిటీలో మహిళా కౌన్సిలర్లకు బదులు, కొందరు వారి భర్తలు రాజకీయాధిపత్యం వహిస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. తామే కౌన్సి లర్ అయినట్లు నిబంధనలకు విరుద్ధంగా ము న్సిపల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం జరుగుతోంది. మున్సిపాలిటీకి సంబంధించిన ఏ విషయంలోనైనా పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు తలదూర్చి దురుసుగా వ్యవహరించడం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులతో పాటు కిందిస్థాయి సిబ్బందిని లెక్కచేయకుండా, కనీస మర్యాద లేకుండా మాట్లాడటం, ఏక వచనంతో సంబోధించడం చేస్తుండటంతో అధికారులు, సిబ్బంది ఎవరికి చెప్పుకోలేక సతమతమవుతున్నారు. మున్సిపల్ వ్యవహారాల్లో ఓ ముఖ్య ప్రజా ప్రతినిధి భర్త అన్నీ తానై వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. మున్సిపాలిటీలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలకు ఎప్పుడు తెర పడుతుందో చూడాల్సిందేనని పురప్రజలు నిట్టూరుస్తున్నారు.

దేశాన్ని అగ్రస్థానంలో నిలపడమే మోదీ లక్ష్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



దండేపల్లి: కార్యకర్తలతో బైక్‌ర్యాలీలో రఘునాథ్

దండేపల్లి: భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలపడమే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా దండేపల్లి మండలంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 75ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు గాదె శ్రీనివాస్, ముస్కె కార్తీక్, రవిగౌడ్, బత్తుల శేఖర్, దుమ్మని సత్తయ్య, గుండ రవీందర్, సీపిరిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

మందమర్రిరూరల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ చెన్నూర్ నియోజకవర్గం కన్వీనర్ అక్కల రమేష్ హాజరై ప్రారంభించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయం వద్ద ప్రారంభమైన బైక్‌ర్యాలీ, పలు వీధుల గుండా మువ్వన్నెల జెండాను పట్టుకొని 'భారత్ మాతా కి జై' అంటూ నినదించారు. బీజేపీ, అనుబంధ సఘాల నాయకులు నరేష్, రమేష్ గౌడ్, శ్రీనివాస్, సురేందర్, మతీన్ తదితరులున్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తులపై సర్వే ప్రారంభం



పిన్నారంలో సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి

కోటపల్లి: సొంత స్థలం కలిగి ఉండి, ఇంటిని నిర్మించుకోవాలనుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద అందించే సాయం కోసం దరఖాస్తులు చేసుకునే వారిలో అర్హులను గుర్తించేందుకు అధికారులు సర్వేను ప్రారంభించారు. దరఖాస్తులో పేర్కొన్న అంశాలు సరైనవేనా, కాదా అన్న అంశాలను సర్వే సిబ్బంది స్వయంగా వెళ్లి పరిశీలిస్తున్నారు. సొంత స్థలానికి సంబంధించిన పత్రాలు, ఆధార్‌కార్డు, ఓటర్‌కార్డు ఇప్పుడు ఉంటున్న ఇల్లు సొంతదా, లేక కిరాయి ఇంట్లో ఉంటున్నారా చిరునామా, వార్డునంబర్, ఆహారభద్రత కార్డు కుటుంబసభ్యుల వివరాలు గ్రామానికి చెందిన వ్యక్తులా తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గజ్జెల లస్మక్క, కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

'దళారులను నమ్మి మోసపోవద్దు'

జన్నారం: అర్హులైన వారికి ప్రభుత్వం అందించే పథకాలు తప్పనిసరిగా వస్తాయని, దళారులను నమ్మి మోసపోవద్దని తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గృహలక్ష్మి దరఖాస్తుల విషయంలో కొందరు గ్రామాల్లో తప్పుదోవ పట్టించినట్లు తెలిసిందన్నారు. గృహలక్ష్మి పథకం కింద సొంతభూమి, భూమికి సంబంధించిన పత్రాలు ఉండి ప్రభుత్వం ద్వారా ఇతర పథకాలు పొందని వారికి అర్హులుగా ప్రకటించడం జరుగుతుందన్నారు. ఇందుకు ఎలాంటి ధ్రువీకరణ పత్రం అవసరం లేదన్నారు.

ఉపాధ్యాయుడి ఉదారత

దండేపల్లి: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని, దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 80మంది బాలికలకు పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు సంగర్స్ రాజేశ్వర్‌రావు జడ రిబ్బన్స్ అందించి, తన ఉదారతను చాటుకున్నాడు.

ఆలయంలో అఖండ భజన

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు సమీపంలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో ఆదివారం రాత్రి ఆలయ అర్చకులు కృష్ణకాంతాచారి ఆధ్వర్యంలో అఖండ భజన కార్యక్రమం చేపట్టగా, సోమవారం కూడా కొనసాగింది.

బోదకాలు నివారణ మాత్రల పంపిణీ



మంచిర్యాలరూరల్(హాజీపూర్): కమాండెంట్ సమక్షంలో మాత్రలు వేసుకుంటున్న సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్, వేంపల్లి గ్రామాల్లో సోమవారం దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ బోదకాలు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బోదకాలు నివారణకుగాను కలెక్టివ్ ఐవర్ మెక్టిన్, డీఈసీ, అల్బెండాజోల్ మాత్రలు ఇటు బెటాలియన్ సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు స్థానికులతో మాత్రలు మింగించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్రభుత్వం అందజేస్తున్న మందులను ప్రతి ఒక్కరూ తప్పకుండా తీసుకోవాలని, ముఖ్యంగా బావితరాలకు ఈ వ్యాధి రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా, బెటాలియన్ డిస్పెన్సరీ వైద్యులు సంతోశ్‌సింగ్, శ్రీధర్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌ఓ రామ్మూర్తి, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, పర్యవేక్షకురాలు జయమణి, ఆశా కార్యకర్త చాంద్‌బీ, బెటాలియన్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలలో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ బోదకాలు నివారణ మందులను పంపిణీ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బోదకాలు వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండేందుకు మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ పర్యవేక్షణాధికారి రామ్మూర్తి, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, హెచ్‌ఈవో లక్ష్మణాస్వామి, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియా పరిసర ప్రాంత కాలనీ వాసులకు టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యా షన్ డిజైనింగ్, క్లాత్ జాబ్ బంజారా బ్యాగ్స్ మేకింగ్ కోర్సులు నేర్చుకోవడానికి ఉద్యోగుల డిపెండెంట్స్, మాజీ ఉద్యోగుల డిపెండెంట్స్, భూ నిర్వాసిత మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీజీఎం పర్సనల్ అరవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికేట్, కులం సర్టిఫికేట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పాటు పూర్తి వివరాలతో ఈ నెల 20లోగా ఏరియా జీఎం కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

తాండూర్: రేచిని పంచాయతీ పరిధిలోని బారేపల్లి గ్రామానికి చెందిన గిరుగల శారద అనే మహిళ అదృశ్యమైంది. సోమవారం తెల్లవారుజాము 4గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా కనిపించలేదు. కొద్దిరోజుల నుంచి మతిస్థిమితం సరిగ్గాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు 81069 60925నంబర్‌ను సంప్రదించాలని కుటుంబీకులు కోరారు.

గుడుంబా పట్టివేత

భీమిని: కన్నెపల్లి మండలంలోని సుర్జాపూర్ నుంచి బైక్ పై గుడుంబా తరలిస్తుండగా కన్నెపల్లి ఎస్సై నరేష్ సిబ్బందితో కలిసి రైడ్ చేసి పట్టుకున్నారు. మండలంలోని సుర్జాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జంగంపల్లి గ్రామానికి చెందిన దుర్గం సత్యనారాయణ, ప్రభుత్వ నిషేధిత సుమారు 5లీటర్ల గుడుంబాను బైక్‌పై విక్రయించేందుకు తీసుకెళ్తుండగా, పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

'ఈటల'ను కలిసిన బీజేపీ నాయకులు



రామకృష్ణాపూర్: బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ను పట్టణానికి చెందిన పార్టీ నాయకులు సోమవారం హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈటలను కలిసి నియోజకవర్గ సమస్యలు, పార్టీ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో వేలాల ఉపసర్పంచ్ నగేష్, నాయకులు సుశీల్‌కుమార్, జంగపెల్లి మల్లయ్య, వైద్య శ్రీనివాస్, సత్యనారాయణ, వీరమల్ల రాజయ్య, చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారులొచ్చినా.. ప్రజలు రాలే.!

- ప్రజావాణికి దరఖాస్తులు నిల్

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ లక్ష్మయ్య ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అర్జీలు రాలేదు. అధికారులు ఎవరూ రాకపోగా, ఉపాధిహామీ సిబ్బందితో ప్రజావాణిని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ సత్యప్రసాద్, ఉపాధి ఈసీ మధు, ఇరిగేషన్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాజలింగు, సీఆర్పీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధికారులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజల నుంచి మాత్రం సమస్యలపై దరఖాస్తులు రాలేదు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా, ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గాంధీ చిత్ర ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రమైన మంచిర్యాల శ్రీనివాస(ఏషియన్) సినిమా థియేటర్లలో సోమవారం లాంఛనంగా గాంధీ చిత్ర ప్రదర్శన ప్రారంభించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గర్మిళ్ల హైస్కూల్‌కు చెందిన 900మంది విద్యార్థులు వీక్షించారు. డీఈవో యాదయ్య, సెక్టోరల్ అధికారి చౌదరి, ఎంఈవో పోచయ్య, పాఠశాల హెచ్‌ఎంలు శారద, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల పరిశీలన



నాటు పడవ యజమానులతో మాట్లాడుతున్న ఎస్సై

కోటపల్లి: తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత నదీ పరివాహక ప్రాంతాలను ఎస్సై సురేశ్, సుబ్బారావు పరిశీలించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సరిహద్దుల్లో తనిఖీలు నిర్వహించారు. సంఘ విద్రోహ శక్తులకు ఎవ్వరూ కూడా సహకరించకూడదని, ఆశ్రయం కల్పించకూడదని సూచించారు. సరిహద్దుల్లో పడవ యజమానులతో మాట్లాడుతూ అనుమానాస్పదంగా ఎవరైనా సంచరించినా, కొత్త వ్యక్తులు కనిపించినా పోలీస్‌లకు సమాచారం అందించాలని సూచించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

నస్పూర్: బెల్లంపల్లి డివిజన్ సివిల్ క్వాలిటీ డీజీఎంగా విధులు నిర్వర్తిస్తూ ఆర్‌జీ 1 ఏరియా డీజీఎం సివిల్‌గా బదిలీపై వెళ్తున్న నాగేశ్వర్‌రావును శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నాగేశ్వర్‌రావుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్, సీఎంఓఏఐ నాయకులు అబ్దుల్ ఖాధర్, ఏవీ రెడ్డి, రక్షణ అధికారి శ్రీధర్‌రావు, డీవైసీఎంఓ డాక్టర్ రమేశ్‌బాబు, అధికారులు అరవిందరావు, శివరావు, ఆనంద్‌కుమార్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏరియర్స్ సెప్టెంబర్ వేతనంతో చెల్లించాలి

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగులకు 11వ వేజ్‌బోర్డ్ వేతన బకాయి ఏరియర్స్‌ను సెప్టెంబర్ నెల వేతనంతో చెల్లించాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్‌లపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ నాయకులు, ఫిట్ కార్యదర్శులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



ఏసీపీ సదయ్యకు స్వాగతం పలుకుతున్న ఎస్సై

భీమిని: ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య అన్నారు. భీమిని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ప్రతి గ్రామాన్ని తప్పనిసరిగా సందర్శించాలని పేర్కొన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, 100డయల్ ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట తాండూర్ సీఐ శ్రీనివాస్‌రావు, భీమిని ఎస్సై మహేందర్, పోలీసులు ఉన్నారు.

16న దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 16న దివ్యాంగులకు ఉచి త బస్‌పాస్‌ల పంపిణీ చేయనున్నట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. మహిళా తరంగిణి ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత బస్సు పాస్‌ల పంపిణీ జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ, పరిసర ప్రాంత దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'

మంచిర్యాలటౌన్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందడం, అభివృద్ధి జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని 18వ వార్డు మజీద్‌వాడలో సోమవారం గడపగడపకూ పీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా ఆది శశికళ, సంజీవ్‌ల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కొనసాగుతున్న పాదయాత్ర

కాసిపేట: మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పల్లెపల్లెకు పాదయాత్ర కార్యక్రమం మూడో రోజు సోమవారం కాసిపేటలో కొనసాగింది. మండలంలోని వెంకటాపూర్ నుంచి పాదయాత్ర ప్రారంభించి సుంగుపంతులుగూడం, రొట్టపల్లి, ఎస్సీ కాలనీ, చిత్రంగూడం, మల్కెపల్లి, ధర్మరావుపేటలో నిర్వహించి అక్కడే బస చేశారు.

'అరెస్ట్ చేయడం హేయమైన చర్య'

నెన్నెల: తమకు న్యాయం చేయాలంటూ బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య క్యాంపు ఆఫీస్ ఎదుట ఆందోళనకు దిగిన ఆరిజన్ డైరి సీఈఓ షేజల్‌కు మద్దతు తెలపడానికి వెళ్లిన తమను అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చొప్పదండి దుర్గాభవాని, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్ అన్నారు. తమను బెల్లంపల్లిలో సోమవారం ముందస్తుగా అరెస్ట్ చేసి నెన్నెల పోలీస్‌స్టేషన్‌కు తరలించారని ఆరోపించారు. షేజల్‌కు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ముడిమడుగుల మహేందర్, శ్రావణ్, కోడి రమేష్, దార కల్యాణి, స్రవంతి, సురేష్ ఉన్నారు.

ఐకమత్యంతో పార్టీ బలోపేతం చేద్దాం

జన్నారం: ఐకమత్యంగా ఉండి, రానున్న ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసి పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఇటీవల పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియామకమైన రవి నాయక్, ఆదివాసీ డిపార్టుమెంట్ జిల్లా ఉపాధ్యక్షుడు అడాయి హన్మంతు, మండల ఉపాధ్యక్షుడు కొడప ఆనంద్‌లను సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ తరుపున ఘనంగా సన్మానించారు.